# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 25-09-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశ అభివృద్ధిలో "మేక్ ఇన్ ఇండియా" ముఖ్యమైన పాత్ర పోషించిందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ పేర్కొన్నారు.
- ❖ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "మేక్ ఇన్ ఇండియా" కార్యక్రమం ఈరోజుతో 10 సంవత్సరాలు పూర్తి చేసుకుంది.
- ❖ సమగ్ర ఆర్థిక సహకార వాణిజ్య ఒప్పందాన్ని బలోపేతం చేయడానికి భారత్ - ఆస్ట్రేలియా దేశాలు కృషి చేస్తున్నాయని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు.
- ❖ జమ్మూ కాశ్మీర్‌లో రెండో విడత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ లో ఈ సాయంత్రం 5 గంటల సమయానికి 54 శాతం ఓటింగ్ నమోదైందని ఎన్నికల సంఘం వెల్లడించింది.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 114వ సంచిక ఈనెల 29న ప్రసారమవుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరప్రదేశ్ లోని గ్రేటర్ నోయిడాలో "ఇంటర్నేషనల్ ట్రేడ్ షో" 2వ ఎడిషన్‌ను ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ ఈరోజు ప్రారంభించారు. వియత్నాంను భాగస్వామిగా చేయడంతో పాటు ఉత్తరప్రదేశ్ వాణిజ్యం, సంస్కృతిని ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 5 రోజుల ట్రేడ్ షో ఈ నెల 29న ముగియనుంది. ఈ సందర్భంగా దేశ అభివృద్ధిలో భాగంగా వివిధ రంగాలలో డిజిటలైజేషన్, మేక్ ఇన్ ఇండియా పాత్రను ఉపరాష్ట్రపతి ప్రస్తావిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "మేక్ ఇన్ ఇండియా" కార్యక్రమం ఈరోజుతో 10 సంవత్సరాలు పూర్తి చేసుకోవడంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. "మేక్ ఇన్ ఇండియా" దేశాన్ని తయారీ రంగంలో శక్తివంతంగా మార్చడానికి 140 కోట్ల మంది భారతీయుల సమిష్టి సంకల్పాన్ని ఇది తెలియజేస్తుందని సామాజిక మాధ్యమం వేదిక ఆయన పేర్కొన్నారు. సాధ్యమైన అన్ని మార్గాల ద్వారా 'మేక్ ఇన్ ఇండియా'ను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉద్ఘాటించారు. వివిధ రంగాల్లో ఎగుమతులు, సామర్థ్యాలు పెరిగాయని అన్నారు. గత దశాబ్ద కాలంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న వారందరికీ ప్రధానమంత్రి అభినందనలు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

సమగ్ర ఆర్థిక సహకార వాణిజ్య ఒప్పందాన్ని బలోపేతం చేయడానికి భారత్ - ఆస్ట్రేలియా దేశాలు కృషి చేస్తున్నాయని కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఈ ఒప్పందం ఫలితంగా ఇరు దేశాల్లో సులభతర మార్కెట్ ఏర్పడిందని, వాణిజ్యంలో గణనీయమైన పురోగతి సాధిస్తోందన్నారు. ఈరోజు ఆస్ట్రేలియా లోని అడిలైడ్‌లో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... సిడ్నీలో వాణిజ్య కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ఈ కార్యాలయం పెట్టుబడిదారులకు, వ్యాపారులకు మధ్య వారధిగా పని చేస్తుందన్నారు. ఆదే విధంగా మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం గురించి ప్రస్తావిస్తూ.. భారతదేశంలో తయారీరంగాన్ని ప్రోత్సహిస్తున్న ఈ కార్యక్రమం అద్భుతమైన విజయాలను సాధించిందని అన్నారు.

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కాశ్మీర్‌లో ఈరోజు జరిగిన రెండో విడత అసెంబ్లీ ఎన్నికలలో సాయంత్రం 5 గంటల సమయానికి 54 శాతం ఓటింగ్ నమోదైందని ఎన్నికల సంఘం వెల్లడించింది. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య కేంద్ర పాలిత ప్రాంతంలోని ఆరు జిల్లాల్లోని 26 అసెంబ్లీ నియోజక వర్గాల్లోని మొత్తం 3 వేల 502 పోలింగ్ స్టేషన్లలో ఉదయం 7 గంటలకు ఓటింగ్ ప్రారంభమైంది. జమ్మూ ప్రాంతంలోని రియాసి, రాజౌరి, పూంచ్ జిల్లాలు కాశ్మీర్ లోయలోని శ్రీనగర్, బుద్గాం గందర్‌బల్ జిల్లాలో ఈరోజు పోలింగ్ జరిగింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

వక్ఫ్ (సవరణ) బిల్లును సమీక్షించేందుకు ఏర్పాటైన పార్లమెంట్ జాయింట్ కమిటీ రానున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో తన నివేదికను సమర్పించే అవకాశం ఉందని మైనారిటీ వ్యవహారాల శాఖా మంత్రి కిరన్ రిజిజు పేర్కొన్నారు. ఈ కమిటీకి ఇప్పటి వరకు కోటికి పైగా రిప్రజెంటేషన్లు వచ్చాయని తెలిపారు. 3వ సారి ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటైన 100 రోజుల్లో మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సాధించిన విజయాలపై ఈరోజు ఆయన పాత్రికేయులకు వివరిస్తూ... పార్లమెంట్ జాయింట్ కమిటీ విస్తృతమైన సంప్రదింపులు జరుపుతుందని, వివిధ ప్రభుత్వాలు, సామాజిక సంస్థల నుండి అభిప్రాయాలు సూచనలను కోరుతుందని తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఆసియా మూడవ అత్యంత శక్తివంతమైన దేశంగా భారత్ అవతరించింది. ఆసియా పవర్ ఇండెక్స్-2024 నివేదిక ప్రకారం జపాన్‌ను అధిగమించి భారత్ 3వ స్థానానికి చేరుకుంది. కోవిడ్ అనంతరం బలమైన ఆర్థిక వృద్ధిని సాధించి భారత్ తన ఆర్థిక సామర్థ్యాన్ని 4.2 పాయింట్లు పెంచుకొందని ఆ సూచీ పేర్కొంది. భవిష్యత్ వనరుల్లో భారతదేశం మంచి పనితీరు కనబరిచిందని ఈ నివేదిక ప్రస్తావించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

హర్యాణా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోనిపట్‌లోని గోహనాలో ఈరోజు జరిగిన జనాశీర్వాద్ ర్యాలీలో బీజేపీ సీనియర్ నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రారంభించిన “మేక్ ఇన్ ఇండియా” పథకం ప్రయోజనాలను ఆయన ప్రస్తావించారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో పరిశ్రమలు, వ్యవసాయం వంటి రంగాల్లో హర్యానా అగ్రస్థానంలో నిలిచిందని నరేంద్ర మోదీ అన్నారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కూడా కురుక్షేత్రలో జరిగిన బహిరంగ ర్యాలీలో ప్రసంగించారు. కాగా 90 శాసన సభ స్థానాలున్న హర్యాణా అసెంబ్లీకి అక్టోబరు 5న పోలింగ్, 8వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 114వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న మూడు రోజుల పాటూ కొంకణ్, గోవా, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్‌ల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆదే విదంగా అస్సాం, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్, సబ్ - హిమాలయన్ పశ్చిమ బెంగాల్, సిక్కింలో రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ ను టెలికాం ఉత్పత్తుల తయారీకేంద్రంగా మార్చడంపై దృష్టి సారించామని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖా మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. న్యూఢిల్లీలో టెలికాం సెక్టార్ ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీదారులు, టెలికాం సర్వీస్ ప్రొవైడర్లు, వాటాదారుల సలహా కమిటీతో ఆయన వేర్వేరు సమావేశాలను నిర్వహించారు. భారతదేశాన్ని ప్రపంచానికి టెలికాం తయారీ కేంద్రంగా మార్చేందుకు అన్ని పరిశ్రమల విభాగాలు, టెలికాం సర్వీస్ ప్రొవైడర్లు, టెలికాం ఇండస్ట్రీ అసోసియేషన్లు, స్థానిక తయారీదారులు కలిసి పని చేయాలని కేంద్రమంత్రి పిలుపునిచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఝార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎంఎస్ రామచంద్రరావు ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు. రాంచీలోని రాజ్‌భవన్‌లో జార్ఖండ్ గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్ జస్టిస్ రామచంద్రరావుతో ప్రమాణం చేయించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ 2023-24 సంవత్సరానికి ప్రధాన వ్యవసాయ పంటల ఉత్పత్తి తుది అంచనాలను ఈరోజు విడుదల చేసింది. బియ్యం, గోధుమలు మరియు శ్రీ అన్నల సానుకూలమైన ఉత్పత్తి కారణంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి రికార్డు స్థాయిలో పెరిగిందని మంత్రిత్వ శాఖ తెలిపింది. 2023-24లో దేశంలో మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తి రికార్డు స్థాయిలో 3 వేల 322 లక్షల మెట్రిక్ టన్నులుగా అంచనా వేస్తున్నామని, ఇది 2022-23తో పోలిస్తే 26 లక్షల మెట్రిక్ టన్నులు ఎక్కువని వెల్లడించింది. బియ్యం ఉత్పత్తి రికార్డు స్థాయిలో వెయ్యి 378 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉందని.. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి అందిన సమాచారం ఆధారంగా ఈ అంచనాలను ప్రాథమికంగా తయారు చేసినట్లు పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =